క్లుప్తంగా

ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పత్ర-పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం పత్ర–పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులు పూజా సామగ్రితో వచ్చి స్వామిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకూ క్యూలో ఉన్నారు. ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి అర్చకులు, భక్తులతో ప్రత్యేక అలంకరణ చేశారు.

గాలికి వదిలేసిన అర్బన్ హెల్త్ సెంటర్



నిర్మాణం పూర్తయిన బెలగాం అర్బన్ హెల్త్‌సెంటర్

పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వంలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో పార్వతీపురం పట్టణంలో బెలగాం అర్బన్ హెల్త్ సెంటర్‌ను పూర్తి చేశారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 100 రోజులు గడుస్తున్నప్పటికీ ఈ భవనాన్ని ప్రారంభించకుండా వదిలేసింది. పట్టణ ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకురాకపోవడంతో పట్టణంలో చర్చ సాగుతోంది. పంతాలు పక్కనపెట్టి ఈ భవనాన్ని ప్రజావసరాల నిమిత్తం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మక్కువ బైపాస్ రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న గొయ్యి

సాలూరు రూరల్: పట్టణంలోని మక్కువ బైపాస్ రోడ్డు చివరలో పెద్దగొయ్యి వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. బైపాస్ రోడ్డుపై ప్రయాణించే వారు బీటీ రోడ్డు చివరికి చేరేసరికి అకస్మాత్తుగా ఈ గొయ్యి దర్శనమిస్తుంది. దీంతో వాహన చోదకులు సడన్ బ్రేక్ వేయడంతో ఈ గొయ్యివద్ద పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. బీటీ రోడ్డు సీసీ రోడ్డు కలిసే దగ్గర ఏర్పడిన గొయ్యి రోడ్డుకు అడ్డంగా ఒక గట్టులా ఉండడంతో వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. వెంటనే మున్సిపల్ అధికారులు ఈ గొయ్యిని కప్పి ప్రమాదాలను నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

భద్రతకు తొలి ప్రాధాన్యం

పాలకొండ రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులు, తమ వ్యక్తిగత భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. డిపో నుంచి బస్సు బయటకు తీసుకువెళ్లే ముందు గ్యారేజీలో వాహనం కండీషన్ పరిశీలించాలని సూచించారు.

గొర్రెల మందకు ఆదరణ

- విసర్జితాలతో పంటలకు బలం
- భూసారం పెంచేందుకు రైతుల్లో ఆసక్తి

బలిజిపేట:

వ్యవసాయంలో ఆధునీకరణ పద్ధతులు ఎన్ని వస్తున్నా కొంతమంది రైతులు మాత్రం అలనాటి పద్ధతులనే పాటిస్తూ వస్తున్నారు. ఎరువుల భారం ప్రతి ఏడాదీ పెరిగి పోతూ వ్యవసాయం భారంగా మారిన నేపథ్యంలో రైతులు పెట్టుబడిని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా పాత పద్ధతులకు పెద్దపీట వేస్తున్నారు. అందులో భాగంగా గొర్రెల మందలను పొలాల్లో కట్టి వాటి మల విసర్జితాలను ఎరువుగా ఉపయోగించే పద్ధతులను ఇటీవల రైతులు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏటా మాదిరిగానే పల్లె ప్రాంతాల్లో గొర్రెలమందలకు డిమాండ్ పెరుగుతోంది. ఖరీఫ్ ముగిసే సమయానికి సంప్రదాయ రీతిలో పంట పొలాల్లో ఇటీవల గొర్రెలు మందలు అత్యధికంగా కనిపిస్తున్నాయి. గొర్రెల మందలను పొలాల్లో ఉంచేటప్పుడు మందలో ఉండే గొర్రెలను బట్టి ఒక రోజుకు రూ.500వరకు చెల్లించాల్సి ఉంటుంది. భూసారం పెంచుకునేందుకు రైతులు వారికి అవసరమైనంత కాలం ఉంచుతారు.



ప్రధాన రహదారిపై గొర్రెలను తోలుకు వెళ్తున్న కాపరులు



పొలంలో మందలో ఉన్న గొర్రెలు

గొర్రెలకు ఉదర పోషణ

గొర్రెల కాపరులు తమ గొర్రెలకు ఆహారం నిమిత్తం గొర్రెలను ఆహారం దొరికే ప్రాంతాలకు తోలుకుని వెళ్తుంటారు. ముఖ్యంగా ఖరీఫ్ పూర్తయిన తర్వాత గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వస్తుంటారు. ఖరీఫ్‌కు, రబీకి మధ్య కాలంలో పంటపొలాల్లో గొర్రెలను తిప్పడం ద్వారా గొర్రెలకు ఉదర పోషణ జరుగుతుంది. అదే సమయంలో గొర్రెలు వేసే మలవిసర్జన పంట పొలాలకు ఎరువుగా ఉపయోగపడడంతో రైతులకు, గొర్రెల కాపరులకు ఉభయతారకంగా ఉంటుంది. ప్రస్తుతం గొర్రెల మందలను పంటపొలాల్లో మంద కట్టేందుకు రైతులు మునుపెన్నడూ లేనివిధంగా ఆసక్తి చూపుతున్నారు. రైతులు కనీసం ఒక రోజైనా తమ పంట పొలాల్లో గొర్రెల మంద కట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు:

ఇదే సమయంలో గొర్రెల మందలను కిలోమీటర్ల దూరం తరలించేందుకు తీసుకువెళ్తున్న సమయంలో కాపరులకు వ్యయప్రయాసలు అధికమవుతున్నాయి. రోడ్లపై నడిచే గొర్రెలను సంరక్షించుకునే సమయంలో గంటల తరబడి ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల కాపరులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినా గొర్రెలకు ఉదరపోషణ జరుగుతుందనే ఉద్దేశంతో సుదూర ప్రాంతాలకు గొర్రెలను తీసుకువస్తుంటారు. ఒకొక్కసారి గొర్రెలు గాయాలబారిన పడడంతో కాపరులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. వాటిని ప్రధాన రహదారులపైనే నడిపిస్తుంటారు. ఈ విధంగా గొర్రెలు గంటల తరబడి రోడ్లపైనే ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయి.కాపరులు వాటిని పక్కకు నెడుతూ తోలకపోవడంతో రోడ్డుపైనే అవి నడుస్తుంటాయి. ఈ సమయంలో వచ్చిపోయే వాహనాలకు అడ్డంగా తగలడంతో ప్రమాదాలు సంభవిస్తుంటాయి.

భూసారం పెరుగుతుంది

గొర్రెల మందలను పంటపొలాల్లో ఉంచడం వల్ల భూసారం పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం తక్కువగా ఉంటుంది. మంచి దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయి.

–సూరినాయుడు, రైతు, బలిజిపేట

వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి

- రూరల్ సీఐ రామకృష్ణ

సాలూరు రూరల్: వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్‌టీసీ డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలు డిపో మేనేజర్ ఎ.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ రామకృష్ణ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అతివేగం ప్రమాదాలకు కారణమని వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే జిల్లా డీపీటీఓ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నిరుపయోగంగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు

సాలూరు రూరల్: పట్టణంలోని మక్కువ బైపాస్ రోడ్డు చివరలో మున్సిపల్ మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా మరుగుదొడ్ల గదులు రోడ్డుకు ఆనుకుని నిర్మాణం చేశారు. ఆ గదులకు తలుపులు లేకపోవడంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వారు వాటిని పొరపాటున చూసిన ఒక్కసారిగా ముక్కుమూసుకుని వాంతులు చేసుకునేలా ఫీలవుతున్నారు. అసలు ఈ మరుగుదొడ్లు వాడుకలోకి తీసుకురాలేని ఎడల వాటిని తొలగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ మలవిసర్జనను అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఈ మరుగుదొడ్లు ఆ రోడ్డు గుండా ప్రయాణించేవారికి ఇబ్బందికరంగా మారాయి. స్థానిక మంత్రి పట్టణంలోని మరుగుదొడ్లను వాడుకలోకి తేవాలని ఆదేశాలు జారీ చేసి నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో పట్టణ వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

పర్యవేక్షణ లోపం

పార్వతీపురం టౌన్: విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పట్టపగలే వీధిదీపాలు వెలుగుతూ వారి నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీధి దీపాల నిర్వహణలో ఉన్న సమస్యలను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. పట్టణంలోని చాలా వార్డుల్లో, పట్టణ ప్రదాన రహదారిపై వీధిదీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోంది. ఫలితంగా విద్యుత్‌శాఖ నిర్వాకంతో గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రత్యేక లైన్‌లు వేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేల కోట్లు వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్‌చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. దీంతో పట్టణంలో వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధిలైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పా టుచేసి ఆన్‌ఆఫ్ స్విచ్‌లను వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణ ప్రధాన రహదారిపై వెలుగుతున్న వీధి దీపాలు



వీధుల్లో వెలుగుతున్న వీధిదీపాలు

ఆక్రమణలకు గురవుతున్న పేరసాగరం

- లే అవుట్లుగా మారిన ఆయకట్టు భూములు
- పట్టణ వాసులకు పార్కు, బోటు షికారుకు అవకాశం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పేరసాగరాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్న పట్టణవాసులు

సాలూరు రూరల్: దశాబ్దాలుగా వందల ఎకరాలకు నీరు అందించి పట్టణ పరిసర ప్రాంత రైతులకు అన్నదాతగా పేరున్న పేరసాగరం ప్రస్తుతం పట్టణ మురుగునీటితో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుతోంది. చెరుకుపల్లి గెడ్డ నీరుతో ఈ చెరువు నిండి సాలూరు, గుమడ, ప్రాంత రైతులకు నీరు అందిస్తుంది. పట్టణంలో గల ఆయకట్టు ప్రాంతమంతా లేఅవుట్లుగా మారడంతో చెరువునీరు దిగువనున్న గుమడాం ప్రాంత రైతులకు వినియోగపడుతోంది. అయితే ఈ చెరువు పూర్తిగా పట్టణంలో ఉండడంతో చెరువు చుట్టుపక్కల చాలావరకు ఆక్రమణలకు గురైంది. ఇలాగే అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ఉన్న చెరువు కూడా ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని పట్టణవాసులు వాపోతున్నారు.

పార్కు, బోటు షికారుకు అవకాశం

మున్సిపాలిటీ ఏర్పాటు జరిగి దశాబ్దాలు అవుతున్నా ఇంతవరకు కనీసం పట్టణవాసులు పిల్లలతో వెళ్లి సరదాగా గడపడానికి ఒక్క మంచి పార్కును కూడా నిర్మాణం చేయలేకపోవడం పట్టణ వాసుల దురదృష్ట కరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పేరసాగరం పార్కుతో పాటు బోటు షికారు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని పలువురు పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు. ఉదయాన్నే పట్టణ వాసులు జాతీయ రహదారిపై వాకింగ్ చేస్తున్నారు. చెరువును అభివృద్ధి చేస్తే చెరువుగట్టు చుట్టూ పట్టణ వాసులు వాకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం కోసం రోడ్లపై నడుస్తున్న ప్రజలకు కాలుష్యంతో పాటు ప్రమాదాలు నియంత్రించిన వారవుతారని అంటున్నారు.

పేరసాగరం అభివృద్ధి విషయంలో స్వచ్ఛంద సంస్థలతో కలిసి అభివృద్ధి చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని పట్టణ వాసులు వ్యక్తం చేస్తున్నారు. పేరసాగరం అభివృద్ధి జరిగితే పట్టణానికి తలమానికంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.



చెరువు గట్టు చుట్టూ అక్రమణలు



పేరసాగరం చెరువు

బహుమతుల అందజేత

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గులు, ఆటపాటల పోటీలు నిర్వహించారు. వాటిలో గెలుపొందిన వారికి ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు బహుమతులను గురువారం అందజేశారు. ఇంటింటా వేసిన రంగుల ముగ్గులను పరిశీలించి సంస్కృతి, సంప్రదాయాలను సూచించే ముగ్గులకు ప్రాధాన్యం ఇచ్చారు. కనుమ నాడు పిల్లలకు ఆటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు.పెద్దవారు కూడా వారి బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా ఆడిపాడారు. పండగలు మనలో ఉత్సాహాన్ని నింపుతూ మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని డాక్టర్ జగన్‌మోహన్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి, కుటుంబసభ్యులు,గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రావు

మునగ చెట్టుకు చీడపురుగులు

సీతానగరం: మండలంలో ప్రతి ఇంటి ముందు, వెనుక ఖాళీ స్థలాల్లో వరిచేను కుప్పలు వేసే కళ్లాల్లో రైతులు నాటిన మునగ చెట్లకు పురుగులు పట్టి చెట్టు ఎదుగుదలను హరించడంతో పాటు మునగ కాయల ఎదుగుదలకు అడ్డంకిగా ఉంది. పువ్వు కొనలతో ఉన్న చెట్లమొదళ్లకు ఉన్న బెరడును తినడానికి పురుగుల సమూహం చేరింది. పురుగుల సమూహం చేరడంతో ఆకులురాలి పోవడం, కాపు లేక పోవడంతో రైతులు నివారణ చర్యల కోసం ఎదురుచూస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు నివారణ చర్యలకు సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

చెట్టుకున్న చీడపురుగుల సమూహం



ఎంపీటీసీపై దాడి

సాలూరు రూరల్:

పాచిపెంట మండలంలోని పాంచాలి గ్రామ ఎంపీటీసీ ఉమామహేశ్వరావుపై అదే మండలంలోని మోసూరు గ్రామానికి చెందిన గండిపల్లి శివ, ఉనుకూరు జోసెఫ్‌లు గరువారం రాత్రి చాకుతో దాడిచేసినట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు. ఈ దాడిలో ఉమామహేశ్వరరావు మెడపై గాయం కాగా సాలూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మురుగు కాలువ కాదది.. వేగావతి నది

సాలూరు రూరల్: సాలూరు పట్టణానికి తాగునీరు అందిస్తున్న వేగావతి నదిని మురుగు కాలువలా మార్చేశారు. పట్టణ వాసులు వినియోగిస్తున్న మురుగునీటితో పాటు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. మున్సిపాలిటీ ఏర్పాటు జరిగి అర్ధశతాబ్దం పైనే అయినా ఇప్పటికి మురుగునీరు పారే నదిలో కలవకుండా చర్యలు తీసుకోకపోవడంపై పట్టణ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాన్ని ఆనుకుని పారే వేగావతి నది నీటినే దిగువనున్న శివరాంపురం తదితర గ్రామాల ప్రజలు వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మున్సిపాలిటీ చెత్తలతో నిండిన వేగావతి నది



ములగలో వేసిన ముగ్గులు



కుర్చీలాటలో పాల్గొన్న చిన్నారులు

ములగలో ముగ్గుల పోటీలు

పార్వతీపురం: సంక్రాంతి పండగలో భాగంగా మండలంలోని పలుగ్రామాలలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం, గురువారం మండలంలోని ఎస్.ములగ గ్రామంలో యువత ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను, చిన్నారులకు కుర్చీలాటను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులను కమిటీసభ్యులు అందించారు. మహిళలకు ముగ్గులకు అవసరమైన రంగులను కమిటీ సభ్యులు సమకూర్చారు. ముగ్గుల పోటీలను నిర్వహించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఖాళీ అవుతున్న పల్లెలు



హనుమాన్ జంక్షన్‌లో ప్రయాణికులు



ఆర్వోబీపై ఉన్న వాహనాలు



దారిపొడవునా రోడ్డుపై కుటుంబాలతో నిలిచిపోయిన వాహనాలు

సీతానగరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, పట్టణాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారంతా ముక్కనుమ పండగ చూడకుండానే గురువారం ఉదయమే తిరుగు తిరుగుముఖం పట్టారు. బస్‌సౌకర్యం, ట్రైన్ సౌకర్యం లేక రాష్ట్ర రహదారిలో వారంతా ఎదురుచూస్తున్నారు. వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సంక్రాంతి పండగను పురస్కరించుకుని భోగీ ముందు రోజున స్వగ్రామాలకు చేరుకున్నారు. వారంతా ముక్కనుమ చూసుకుని పయనమవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం ముక్కనుమ పండగ చూడకుండానే పయనమయ్యారు. ఈ మేరకు విశాఖపట్నం, సబ్బవరం, అనకాపల్లి, పరవాడ, తగరపువలస పట్టణాల్లో ఉన్న కుటుంబాల వారు ద్విచక్రవాహనాలపై పయనమయ్యారు. వేలాది కిలోమీటర్ల దూరానికి వెళ్లాల్సిన వారికి వాహనాల సదుపాయంలేక ప్రధారహదారుల్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు.